క్లుప్తంగా

చోటుకు 'ఆది' అభినందనలు



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా రెండోసారి ఎన్నికైన గడ్డం మధుకర్(చోటు)ను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అభినందించారు. ఆదివారం సిరిసిల్లలో సన్మానించారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరవేని తిరుపతి కూతురు మౌనిక వివాహం వేడుకకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, నాయకులు సార శ్రీనివాస్, రాస రవీందర్, నాయకులు ఉన్నారు. అంతకుముందు పల్లిమక్తలో ఏరెడ్డి భాస్కర్‌ను పరామర్శించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ముస్తాబాద్: మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. వంద రోజుల్లోనే యాదవ కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కురుమ సంఘం అధ్యక్షుడు శీల శ్రీనివాస్, కంతుల భాస్కర్, కుమార్, ప్రశాంత్, బాలయ్య, రాజు, చంద్రం, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో అఖండ భజన సంకీర్తన



భజనలు చేస్తున్న భక్తి బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని హనుమాన్ ఆలయంలో కరీంనగర్ నీలకంఠ భజన మండలి వారి ఆధ్వర్యంలో ఆదివారం భజన సంకీర్తనలతో అలరించారు. ఉదయం గ్రామంలోని పురవీధుల గుండా భక్తిపాటలతో ఊరేగింపు నిర్వహించారు. ఇటీవల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరిగాయి. ఆలయంలో భజన, సంకీర్తనల కార్యక్రమాలకు నిర్వహించగా మహిళలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భజన మండలి సభ్యులను మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మి ఘనంగా సన్మానించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఎంపీటీసీ అపెరా సుల్తాన, ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, లింగాల నర్సయ్య, మోతె కిషన్‌రెడ్డి, దర్పల్లి కైలాసం, నర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో దుర్గమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి అలిపిరి ఆనందరెడ్డి రూ. 20,001 అందజేశారు. గ్రామంలో దుర్గమ్మ ఆలయం శిథిలావస్థకు చేరగా ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. మాజీసర్పంచ్ జిన్న అనిల్, నాయిని ప్రభాకర్‌రెడ్డి, జిన్న సత్తయ్య, అనిల్, ఎనగంటి రాజేశం, కిషన్, ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవం



సిరిసిల్ల: పట్టణంలోని చైతన్య భారత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, డీఈవో రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, సిద్దిపేట సీఐ సామల ఉపేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు గూడూరి భాస్కర్, అన్నారం శ్రీనివాస్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సిరిసిల్ల టౌన్ ఉపాధ్యక్షులు బూర శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ ఆడెపు రవీందర్, పాఠశాల కరస్పాండెంట్లు ఆడెపు రేవంత్, కల్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

వేములవాడ: పట్టణంలోని విద్యానగర్ మెయిన్ మజీద్‌లో యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. యూత్ కమిటీ సభ్యులు ప్రతి ఆదివారం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు సభ్యులు ము జాహిత్, ఫహాద్, ముబారక్, జునేద్‌లు తె లిపారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు బషీరొద్దీన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు
- చివరి గ్రామాలకు అందని 'మిషన్ భగీరథ' నీరు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



ఇందిరమ్మ కాలనీలో బోరు వద్ద నీటికోసం మహిళల పడిగాపులు

ముస్తాబాద్: వేసవి ఆరంభంలోనే పల్లెల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. అడుగంటిన భూగర్భ జలాలతో పంచాయతీల బోరు బావుల్లోని నీరు ఇంకిపోయింది. ఫలితంగా గ్రామీణ ప్రజలు నీటికోసం అల్లాడుతున్నారు. చివర ఉన్న గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. మండలంలోని 22 గ్రామాల్లో సగానికి పైగా గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ముస్తాబాద్ మేజర్ పంచాయతీతో సహా చిన్న గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం నాలుగు ట్యాంకర్లతో..

ముస్తాబాద్ కేసీఆర్ కాలనీలో 154 గృహాలకు అధికారులు ఏర్పాటు చేసిన నీటి సరఫరా కష్టంగా మారింది. కాలనీలో నిర్మించిన సంపులోకి పులిచేరు కుంట వద్ద ఉన్న బోరుబావి నుంచి నీటిని సరఫరా చేస్తూ వచ్చారు. పది రోజుల క్రితం బోరుబావి అడుగంటింది. దీంతో కేసీఆర్ నగర్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. ఇటీవల శివరాత్రి పండుగ రోజు కాలనీ ప్రజలకు నీటి కోసం ఇబ్బందులు తప్పలేదు. ప్రజలు ఆందోళన చేయడంతో పంచాయతీ అధికారులు ప్రత్యేకంగా ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. పది రోజులుగా నిత్యం నాలుగు ట్యాంకర్లతో సంపును నింపి కేసీఆర్ నగర్ ప్రజలకు నీరందిస్తున్నారు. కాగా ఇక్కడే ఉన్న ఇందిరమ్మ కాలనీ ప్రజలకు రెండ్రోజులకోసారి నల్లానీరు వస్తోంది. కాలనీలోని ఒకే బోరుతో నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. మరో బోరు వేసి నీటికష్టాలు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి తలెత్తడంతో ప్రత్యేకాధికారి ఇటీవలే పైపులైన్ వేయించి నీటి సరఫరాకు ఆదేశించారు. కేసీఆర్ కాలనీలో మరోబోరు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వడ్డెర కాలనీలో నీటి సమస్య ఉంది. రాజీవ్‌నగర్, పల్లెమీద రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు.

నీటి ఎద్దడి ఉన్న గ్రామాలివే..

- సేవాలాల్‌తండాకు మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదు. పంచాయతీ బోర్లు ఎత్తిపోయాయి. దీంతో గిరిజనులు పంటపొలాల వద్ద నీరు తెచ్చుకుంటున్నారు. కొత్త బోరువేసి నీరందిస్తామని అధికారులు చెబుతున్నారు.
- తెర్లుమద్దిలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోతున్నాయి. మూడురోజులకోసారి మిషన్ భగీరథ నీరు వస్తుంది. ఐదు బోర్లు ఎత్తిపోయాయి.
- ఆవునూర్ మానేరువాగు ఒడ్డునే ఉన్నా తాగునీటికి ఇబ్బంది తప్పడం లేదు. మిషన్ భగీరథ నీరు మూడ్రోజులకోసారి ఒకటి రెండు వార్డులకు వస్తోంది. నాలుగు బోర్లు ఎత్తిపోయాయి. ప్రత్యేకాధికారి సెలవులో ఉండగా, నీటి సరఫరా పర్యవేక్షించేవారు లేరు. మానేరువాగులో ఉన్న మంచినీటి బావిలో నీటిమట్టం తగ్గింది. మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఎంపీటీసీ లలిత కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- కొండాపూర్ గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం జీరో రిపోర్టు ఇస్తున్నామని కార్యదర్శి పేర్కొన్నారు. మానేరు వాగులోంచి నీటి సరఫరా చేస్తున్నారు.
- బందనకల్‌కు వారానికోసారి మిషన్ భగీరథ రావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చెరువు, బావిలోంచి నీటిని సరఫరా చేస్తున్నారు. రోజూ విడిచి రోజు నల్లా ద్వారా నీటి సరఫరా అందిస్తున్నారు.
- చీకోడులో రెండ్రోజులకోసారి మిషన్ భగీరథ నీటి సరఫరా చేస్తున్నారు. పైపులైన్ లీకేజీలతో నీటి సమస్య తలెత్తింది. పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఓపెన్ వెల్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇబ్బందులు ఉండడంతో విద్యుత్ సరఫరా నిలిచి, నీటి సరఫరా ఆగిపోతోంది.
- నామాపూర్‌లో రెండ్రోజులకోసారి నల్లా వస్తోంది. బోర్లలో నీరు అడుగంటగా పైపులను దించారు. శివరాత్రి పండగకు పలు వార్డుల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

ఒక్కటే బోరు నడుస్తుంది



ఇందిరమ్మ కాలనీలో ఒక్క బోరు మాత్రమే నడుస్తుంది. నల్లా నీరు రెండ్రోజులకోసారి వస్తుంది. ఇంకో బోరువేస్తే అందరికీ నీరు అందుతుంది. ఉదయం బోరు వద్ద క్యూలైన్ కడుతున్నారు. కాలనీలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి.

– ఒల్లెపు రజిత, ముస్తాబాద్

చర్యలు తీసుకోవాలి



కేసీఆర్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో నీటి సమస్య బాగా ఉంది. నల్లా నీళ్లు రెండ్రోజులకోసారి వస్తుంది. సంపులోకి ట్యాంకర్ పెట్టి రోజు నీళ్లు నింపుతున్నారు. శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బద్దిపడిగె లక్ష్మి, ముస్తాబాద్

తాగునీటి సమస్య రానివ్వం



మిషన్ భగీరథ నీరు చివరి గ్రామాలకు సరిగా రావడం లేదు. ముస్తాబాద్, పోతుగల్, సేవాలాల్‌తండాల్లో నీటి స మస్య వుంది.నీటి ఎద్దడిని అ ధిగవించేందుకు ప్రత్యామ్నా య ఏర్పాట్లు చేస్తున్నాం. పలు చోట్ల బోరుబావులు వేయిస్తున్నాం. ప్రజలకు నీటి కష్టాలు రాని వ్వం.

– భాస్కరశర్మ, ఎంపీడీవో

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



వేడుకల్లో పాల్గొన్న కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నాగవెల్లి, స్వామివారి కల్యాణ పట్నం వేయగా యాదవులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అంతకుముందు బోనాలు తీసి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం సభ్యులు లంబ ఎల్లయ్య, బుర్రవేని ఎల్లయ్య, రాములు, దేవయ్య, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, నర్సయ్య, కొండపురం శ్రీనివాస్‌రెడ్డి, కిష్టారెడ్డి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కోడ్ కూసినా తొలగని ఫ్లెక్సీలు



బోయినపల్లి ప్రభుత్వ పాఠశాల ఎదుట ఫ్లెక్సీ

బోయినపల్లి(చొప్పదండి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసి 24 గంటలు గడిచింది. బోయినపల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు ఇంకా తొలగించకపోవడం గమనార్హం. ఆదివారం రాత్రి ఏడు గంటలకు బోయినపల్లి ప్రభుత్వ పాఠశాల రోడ్డులో ఫ్లెక్సీలు ఇలా దర్శనం ఇస్తున్నాయి.

ఎన్నాళ్లీ మూగరోదన?



ఈయన గంభీరావుపేటకు చెందిన గంట శ్రీనివాస్. 15 రోజుల క్రితం పాడి ఆవు గాలికుంటు వ్యాధితో మృత్యువాత పడింది. పాల ఉత్పత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న శ్రీనివాస్ ఆధారం కోల్పోయాడు. ఆవుకు గాలికుంటు వ్యాధి వచ్చిందని ఆసుపత్రికి, అధికారుల తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు జిల్లా ఉన్నతాధికారులకు పరిస్థితి వివరిస్తే అధికారులు మందులు వేశారు. కానీ అప్పటికే వ్యాధి ముదిరి ఆవు చనిపోయింది. ఇదే తరహాలో ఈ సీజన్‌లో ఒక్క గంభీరావుపేట మండలకేంద్రంలో దాదాపు 10–15 పాడి ఆవులు మృతిచెందినట్లు రైతులు చెబుతున్నారు.



గంభీరావుపేట పశు వైద్యశాల

- మండల పశు వైద్యాధికారి సహా పోస్టులన్నీ ఖాళీ
- పశు వైద్యానికి అటెండర్లే దిక్కు
- డిప్యూటేషన్ వైద్యాధికారికి రెండు మండలాల బాధ్యతలు
- ఖాళీల భర్తీకి చర్యలు శూన్యం

గంభీరావుపేట: మండలంలో పశు వైద్యం అందని ద్రాక్షగా మారింది. మండల పశువైద్యాధికారి పోస్టుతో సహా పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. దీంతో అటెండర్లే పశు వైద్యానికి దిక్కవుతున్నారు. ఖమ్మం జిల్లా నుంచి డెప్యూటేషన్‌పై వచ్చిన పశువైద్యాధికారికి గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన వారానికి మూడు రోజులు అక్కడ, మరో మూడ్రోజులు ఇక్కడ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండి ఏళ్లు గడుస్తున్నా భర్తీకి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మండలవ్యాప్తంగా 2వేల ఆవులు, 8వేల గేదెలు, 49వేల గొర్రెలు, 6వేల మేకలు, 105 పందులు, 43 కుక్కలు, 68వేల కోళ్లు ఉన్నాయి. మండల పశు వైద్యశాల పరిధిలోని కొత్తపల్లిలో పశువైద్య ఉపకేంద్రం ఉండగా దీని పరిధిలో కొత్తపల్లి, శ్రీగాధ, లింగన్నపేట, కోళ్లమద్ది, ముచ్చర్ల, మల్లారెడ్డిపేట, రామానుజాపూర్ గ్రామాలున్నాయి. అయినా ఆస్పత్రికి అటెండరే దిక్కు.

ఆరేళ్లుగా అసంపూర్తిగానే..

మండలంలోని సముద్రలింగాపూర్‌లో పశువైద్య ఉపకేంద్రం ఏర్పాటుకు ఏళ్లు గడిచినా మోక్షం లభించడం లేదు. ఉప కేంద్రం భవన నిర్మాణం కోసం అప్పట్లో రూ. 7.50 లక్షలు మంజూరయ్యాయి. వాటితో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. భవన నిర్మాణం పూర్తి కావాలంటే మరో రూ. 5లక్షల వరకు అవసరం ఉంది. నిధుల లేమి కారణంగా ఆరేళ్లుగా పనులు అసంపూర్తిగానే ఉంటున్నాయి. గోరింటాల, రాజేశ్వర్‌రావునగర్, గజసింగవరం, సముద్రలింగాపూర్, లక్ష్మీపూర్ రైతులు గంభీరావుపేట పశువైద్యశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ అధికారులు, సిబ్బంది లేకపోతే నిరీక్షించి వెనుదిరుగుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

గంభీరావుపేట పశువైద్యశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆస్పత్రి చుట్టూ ఇటీవల ప్రహరీ నిర్మించినా గేటు లేకపోవడంతో మందుబాబులు అడ్డా వేస్తున్నారు. అదనపు గది నిర్మాణం ఏళ్ల తరబడి అసంపూర్తిగానే ఉంటుంది. ఇటీవల మరో అదనపు గది, టాయిలెట్స్ మంజూరయ్యాయి. పనులు పిల్లర్ల కోసం తవ్విన గుంతలకే పరిమితమయ్యాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, పశువులు, తాగునీరు కరువైంది.

సౌకర్యాలు కల్పించాలి



రైతులు దూర ప్రాంతాల నుంచి పశు వైద్యశాలకు వస్తే కనీసం తాగేందుకు నీరు కూడా లేదు. కాంపౌండ్ వాల్‌కు గేటు ఏర్పాటు చేయాలి. టాయిలెట్స్ నిర్మించాలి. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి సకాలంలో సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

– కోడె రమేశ్, ముస్తఫానగర్

సకాలంలో వైద్యం అందకే..



పశు వైద్యాధికారి, ఇతర పోస్టులు ఖాళీగా ఉండడంతో సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయి. మండలంలో ఎక్కువ మంది రైతులు పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వెంటనే పోస్టులు భర్తీ చేసి పాడి సంపదను కాపాడాలి

– కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి, పాల డెయిరీ అధ్యక్షుడు, గంభీరావుపేట

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



వీర్నపల్లి : వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

గంభీరావుపేట: అకాలవర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలో అకాలవర్షాలతో దెబ్బతిన్న వరిపొలాలను ఆదివారం పరిశీలించారు. మండల అధ్యక్షుడు హమీద్, సింగిల్‌విండో డైరెక్టర్ రాజ్వీర్, ఎంపీటీసీ లక్కిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, ఏఈవో అనూష, యాదగిరిరెడ్డి, రమేశ్‌రెడ్డి, లింగం, శంకర్, నర్సయ్య, వెంకటి, కృష్ణారెడ్డి, రాజురెడ్డి రైతులు ఉన్నారు. గోరింటాలలో దెబ్బతిన్న పంటపొలాలను జెడ్పీటీసీ విజయం పరిశీలించారు.

ముస్తాబాద్ మండలంలో..

ముస్తాబాద్: మండలంలో చిప్పలపల్లి, నామాపూర్, చీకోడు గ్రామాల్లో దెబ్బతిన్న వరిపంటలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేస్తున్నామని వ్యవసాయాధికారి వెంకటేశ్ తెలిపారు. నాయకులు రాజిరెడ్డి, వెంకటేశ్, నరేశ్, బాల్‌రెడ్డి, కరుణాకర్, సత్యంగౌడ్, దీపక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాలవర్షానికి చేతికొచ్చిన పంట నేలవాలింది. ఎగ్లాస్‌పూర్, మరిమడ్ల, కోనరావుపేట, నిజామాబాద్, ధర్మారం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. మరిమడ్లలోని రాజ మల్లేశంకు చెందిన రెండెకరాల వరిధాన్యం, కొంతమంది రైతుల ధాన్యం నేలరాలింది.

వీర్నపల్లి : మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్, కేలోత్ తండా, అడవిపదిర, లాల్‌సింగ్ నాయక్ తండా గ్రామాల్లో అకాల వర్షం కురవగా డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ అధికారి భూంరెడ్డి రైతుల పంటలను పరిశీలించారు. 50 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఏఈవో శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ ప్రవీణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, తదితరులున్నారు.

వైభవంగా పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న తోట ఆగయ్య, నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దిరాజు–పెద్దమ్మల కల్యాణ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యం, ఒడిబియ్యం సమర్పించారు. ఒగ్గు పూజారులు నాగవెల్లి పట్నంవేసి కల్యాణ వేడుక జరిపించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు గుల్లపల్లి నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ఆలయంలో పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు నిమ్మల బాలు, బత్తిని శ్రీనివాస్, రవి, కొలకాని లక్ష్మీరాజం, నిమ్మల రాములు, అంజయ్య, బాబు పాల్గొన్నారు.

అటవీప్రాంతంలో ట్రాక్టర్‌ట్రాలీ

- నెల రోజులుగా ఇక్కడే..
- దొంగలు తెచ్చి పడేశారని అనుమానాలు



అటవీ ప్రాంతంలో వదిలి వెళ్లిన ట్రాలీ

చందుర్తి: నెల రోజులుగా ఓ ట్రాక్టర్ ట్రాలీ మండలంలోని అటవీప్రాంతంలోనే ఉంటుంది. దీని గురించి పట్టించుకునే వారు లేకపోవడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. మండలం రామన్నపేట శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నెల రోజుల క్రితం ట్రాక్టర్ ట్రాలీని తీసుకొచ్చి వదిలి వెళ్లినట్లు ప్రచారంలో ఉంది. అప్పటి నుంచి దాని గురించి పట్టించుకున్న వారు లేక అక్కడే ఉంటుంది. ట్రాలీ తయారీ విధానాన్ని బట్టి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందినదిగా స్థానిక ట్రాక్టర్ యజమానులు భావిస్తున్నారు. దొంగలు ఎత్తుకొచ్చి వదిలేసి వెళ్లారా? పాత కక్షల నేపథ్యంలో ఎవరైనా తీసుకొచ్చి అటవీ ప్రాంతంలో పడేసి వెళ్లారా? అనే అనుమానాలు స్థానికులకు కలుగుతున్నాయి.

పట్టించుకోని పోలీసులు ?

అటవీ ప్రాంతంలో ట్రాక్టర్ ట్రాలీ ఉన్నట్లు తెలిసినా మండల పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల మండలంలోని మర్రిగడ్డకు చెందిన నాయిని రాజిరెడ్డి ట్రాక్టర్ ట్రాలీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై రాజిరెడ్డి చందుర్తి పోలీసులను ఆశ్రయిస్తే రామన్నపేట శివారులోని అటవీ ప్రాంతంలో ట్రాలీ ఉందని.. దాన్ని చూసి రావాలని ఉచిత సలహా ఇచ్చి పంపారు. ఈ సంఘటన స్థానికుల ఆరోపణలకు బలాన్నిస్తుంది. రామన్నపేట శివారులో ఉన్న ట్రాలీ తనది కాదని పోలీసులకు రాజిరెడ్డి తెలిపినా.. అతని ట్రాలీ కోసం విచారణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా పోలీసులు విచారణ చేపడితేనే ట్రాలీ ఎవరిది అనేది తేలనుంది. అప్పటి వరకు ఈ సస్పెన్స్ తప్పదేమో..!

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌లో చేరిక

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు సుంకోజు రాజు, రొండ్ల గోపాల్‌రెడ్డిలు చేరారు. పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో చేరగా ఆయన పార్టీలోకి ఆహ్వానించారు.

ఉచిత వైద్య శిబిరం

తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ (ఛోటు) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన ఐర అఖిర ప్రైవేట్ హాస్పిటల్ వైద్య శిబిరం నిర్వహించి సుమారు 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి: గోపాల్‌రావుపల్లెకి చెందిన ఎర్రబెల్లి విజయ (36) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. దహనసంస్కారాలకు డబ్బులు లేకపోవడంతో దాతలు చందాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బోయినపల్లి: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో శ్రీనివాస దీక్షిత్ తెలిపారు. మండలంలో 10 హైస్కూళ్లు, కేజీబీవీ, గురుకుల, మోడల్‌స్కూల్, ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది. బోయినపల్లి, విలాసాగర్ హైస్కూళ్లలో పదో తరగతి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో పేర్కొన్నారు. బోయినపల్లి హైస్కూల్‌లో 204 మంది, విలాసాగర్ 91 హైస్కూల్‌లో మంది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

ఎల్లారెడ్డిపేట: నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా విద్యార్థులు ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి కోరారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు.

మాజీ సర్పంచ్‌పై డీపీవోకు ఫిర్యాదు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): చింతలఠాణ మాజీ సర్పంచ్ గుర్రం సత్తయ్యపై గ్రామస్తులు స్పెషల్ అధికారితోపాటు డీపీవోకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో తాగునీటి సరఫరా కోసం వేసిన పైపులు గ్రామపంచాయతీ ద్వారా తీసి వినియోగించాలని గతంలో తీర్మానం చేశారు. కానీ మాజీ సర్పంచ్ తన స్వలాభం కోసం సుమారు 500 పైపులను తీసి సొంతానికి వాడుకుంటున్నాడని అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కె.ఆగయ్య, ఎస్.నారాయణ, కె.శ్రీమతి, రాజేశం, పర్శయ్య, ఎల్లయ్య తదితరులున్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో శ్రీమదేలేశ్వర ఆలయ కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మిడిదొడ్డి దేవేందర్, రజక సంఘం అధ్యక్షుడిగా మిడిదొడ్డి యాదగిరి, ఎన్నికయ్యారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడిగా మిడిదొడ్డి బాలరాజు, ఉపాధ్యక్షుడిగా దశరథం ఎన్నికయ్యారు.

రహదారిపై చెట్టు తొలగింపు

తంగళ్లపల్లి: అకాలవర్షానికి బద్దెనపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చెట్టు విరిగి పడిపోగా ఎస్సై దాస సుధాకర్ స్పందించి స్థానికుల సాయంతో తొలగించారు. ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడగా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.